
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.7। కనిష్ఠం 17.6



రంజాన్ వేళలు

శనివారం ఇఫ్తార్ : సా.6.30 | ఆదివారం సహర్ : ఉ.5.07

కొనుగోలు, అమ్మకాల్లో ఇచ్చిన అప్పులు తిరిగి రాబట్టుకోవడంలో నెమ్మదిని, నమ్రతను, మంచి నడవడికను ప్రదర్శించే వ్యక్తిని దైవం (అల్లాహ్) కరుణిస్తాడు



ధీర వనిత





- జిల్లాలో అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- వంటింటి నుంచి పాలన దాకా.. పొలం నుంచి పోరాటాల వరకు
- రాజకీయాల్లో రాణిస్తూ ప్రగతి సాధిస్తున్నారు
- ఉన్నత స్థాయి ఉద్యోగాల్లోనూ మహిళలే ముందంజ
- అన్ని రంగాల్లో ఉనికి చాటుకుంటున్న మహిళలు

కామారెడ్డి/కామారెడ్డి టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నాడు ఆంక్షల సంకెళ్లతో బడికి దూరమైన బాలిక.. నేడు చదువుల తల్లిగా మారి విశ్వ విద్యాలయాల్లోనూ పాఠాలు చెబుతోంది. ఇంటి బాధ్యతల నుంచి దేశ భద్రత వరకు ఆమె లేని చోటు లేదు. పురుషాధిక్యతతో ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళ.. ఇప్పుడు చట్ట సభల్లోనూ తన వాణి వినిపిస్తూ చట్టాలను చేసే స్థాయికి చేరింది. పురుషులు మాత్రం చేసే ఉద్యోగాలను సైతం అవలీలగా చేసేస్తూ ఇటు ఇంటిని ఇటు ఉద్యోగ ధర్మాన్ని నిర్వహిస్తోంది. పొలంలోనే కాదు.. సమస్యలపై పోరాటాల్లోనూ అగ్ర భాగాన నిలుస్తోంది. రంగం ఏది అయితేనేమి అన్నింటా తనదైన ముద్ర వేస్తోంది. ఎంత ఎదిగినా ఇల్లాలి బాధ్యతలను, మధురిమలు పంచే అమ్మ తనాన్ని దూరం చేసుకోవడం లేదు. ఆధునికతను, సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు సాగుతోంది నేటి మహిళ. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

జిల్లా స్థాయి ఉద్యోగాల్లోనూ మహిళలే..

కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లోని కీలకమైన పోస్టుల్లోనూ మహిళలు ఉన్నారు. కీలకమైన శాఖలకు అధిపతులుగా మహిళలు రాణిస్తున్నారు. ఎస్పీ సింధూశర్మ, జిల్లా అటవీశాఖాధికారి నిఖిత, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, ఏఎస్పీ చైతన్యరెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఫరిదా, జిల్లా వైద్య విధాన పరిషత్ సూపరింటెండెంట్ విజయ లక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి రజిత, మార్కెటింగ్ శాఖాధికారి రమ్య, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్రవంతితో పాటు మరెందరో గ్రూప్-2, గ్రూప్-3, కింది స్థాయి ఉద్యోగాల్లోనూ రాణిస్తున్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 8 వేల వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా ఇందులో మహిళా ఉద్యోగులే అధికంగా ఉన్నారు. అలాగే ప్రైవేటు రంగాల్లోనూ వేలాది మంది మహిళా ఉద్యోగులు పని చేస్తున్నారు.

ఆర్థికంగా బలపడుతూ..

జిల్లాలో చాలా మంది మహిళలు తమ హక్కుల సాధనకు ఓ వైపు పోరాడుతునే.. మరోవైపు స్వశక్తిగా ఎదుగుతూ ఆర్థికంగా బలపడుతున్నారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, బీడీ కార్మికులు, మహిళా రైతులు కూలీలు, ఇతర ప్రైవేట్ రంగాల్లో పనిచేసే మహిళా కార్మికులు కనీస వేతనాలు, హక్కుల కల్పనకు పోరాడుతున్నారు. జిల్లాలో వ్యవసాయ రంగంలోనూ రాణిస్తున్నారు. మగ వారితో సమానంగా వ్యవసాయ పనుల్లో ముందుకు పోతున్నారు. జిల్లా వ్యాప్తంగా రైతు వ్యవసాయ కూలీలు 2.50 లక్షల మంది ఉంటే ఇందులో 1.15 లక్షల మంది మహిళా వ్యవసాయ కూలీలు ఉన్నారు. రైతులు, రైతు కూలీలు మగ వారితో సమానంగా వ్యవసాయంలో పాలు పంచుకుంటున్నారు. వ్యవసాయం తర్వాత అత్యధికంగా కుటుంబాలు ఆధారపడి బీడీ పరిశ్రమపై ఉన్నాయి. బీడీ పరిశ్రమలో 90 శాతం మహిళలే ఉన్నారు. జిల్లాలో 1.10 లక్షల మహిళ బీడీ కార్మికులు ఉన్నారు. అదే విధంగా చాలా మంది మహిళలు స్వశక్తిగా ఎదుగుతూ ఆర్థికంగా బలపడుతున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది ఎందరో మహిళలు తమ కుటుంబాలు ఆర్థిక పరిస్థితులను మెరుగు పరుచుకునేందుకు శ్రమిస్తున్నారు.

జనాభాలోనూ.. ఓట్లలోనూ మహిళా మణులదే పై చేయి

జిల్లా జనాభాలోనూ, ఓట్లలోనూ మహిళలదే పై చేయిగా నిలుస్తోంది. జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్‌లలో మొత్తం జనాభా 9,75,625 ఉండగా ఇందులో మహిళల జనాభానే ఎక్కువగా ఉంది. మహిళలు మొత్తం 4,96,812 జనాభా ఉండగా పురుషుల జనాభా 4,72,601 ఉంది. ఓటరు జాబితాలోనూ మహిళలే కీలకంగా ఉన్నారు. జిల్లాలోనూ కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం ఓట్లు 8,777,47 ఉండగా ఇందులో మహిళ ఓట్లు 4,55,063, పురుషుల ఓట్లు 4,22,641 ఉన్నాయి. ప్రతీ నియోజకవర్గాల్లోనూ మహిళా ఓట్లే అధికంగా ఉండటం విశేషం. కామారెడ్డి నియోజకవర్గంలో పురుషుల ఓట్లు 1,22,474 ఉండగా మహిళల ఓట్లు 1,32,514 ఉన్నాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పురుషుల ఓట్లు 1,06,881 ఉండగా మహిళల ఓట్లు 1,16,144 ఉన్నాయి. జుక్కల్ నియోజకవర్గంలో పురుషుల ఓట్లు 99,524 ఉండగా, మహిళల ఓట్లు 1,03,354 ఉన్నాయి. బాన్సువాడ నియోజకవర్గంలో పురుషుల ఓట్లు 93,767 ఉండగా మహిళలు ఓట్లు 1,03,051 ఉన్నాయి.

మహిళలు ఉన్నత లక్ష్యాన్ని సాధించాలి

• బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



మహిళలు తమ ఉన్నతమైన లక్ష్యం కోసం ధైర్యంతో ముందుకు సాగాలి. మహిళలు ఏ రంగంలోనైనా రాణిస్తారని ఆరోగ్యంతో పాటు లక్ష్యం దిశగా ధైర్యంతో ముందుకు సాగినప్పుడే విజయం సాధిస్తామన్నారు. చిన్నప్పటి నుంచి తాను ఉన్నతమైన స్థానంలో ఉండాలని కుటుంబం సభ్యులు చదివించారని డాక్టర్ చదువుతున్న సమయంలో పెళ్లి కావడంతో భర్త తనను ఐఏఎస్ ఆఫీసర్‌గా చూడాలనుకున్నారు. కుటుంబ సభ్యులు, భర్త సహకారంతోనే లక్ష్య సాధన కోసం కృషి చేశారు. వారి ప్రోత్సాహంతోనే ఐఏఎస్ అయ్యాను.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

• ఫరీదా, జీజీహెచ్ సూపరింటెండెంట్



పట్టుదల, ఆత్మ విశ్వాసం ఉంటే స్త్రీలు కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారు. మహిళలు తలుచుకుంటే కానిదంటూ ఏది ఉండదు. ఏ అంశంపైనైనా శ్రద్ధ వహిస్తే ఇట్టే పరిష్కారం కనుగొంటారని నేను నమ్ముతాను. మహిళలకు మంచి సేవలను అందించాలనే సంకల్పంతో పాథాలజిస్ట్‌గా సేవలు అందించడంతో పాటు ప్రస్తుతం జీజీహెచ్ సూపరింటెండెంట్ బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజలకు ఆరోగ్యపరంగా మెరుగైన సేవలు అందేందుకు కృషి చేస్తున్నాను.

ఓపికకు చిహ్నం ఆడ వారు

• దఫేదార్ శోభ, మాజీ జడ్పీ చైర్‌పర్సన్



ఓపిక, సహనానికి చిహ్నంగా ఆడ వారు ఉంటారు. సమాజంలో జరిగే ప్రతీ అంశంను పురుషులతో సమానంగా స్వీకరిస్తూ అంతే దీటుగా పరిష్కారం కూడా కనిపెట్టగల నైపుణ్యం ఆడ వారిలో ఉంటుంది. నేను జడ్పీ చైర్‌పర్సన్‌గా పదవి చేపట్టినప్పటి నుంచి మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను చర్చిస్తూ వాటి పరిష్కారానికి, వారికి తోడ్పాటు అందించేందుకు అన్ని రకాలుగా ఆలోచనలు చేశాం. ప్రతీ మహిళ ధైర్యంతో ముందుకు అడుగువేసినప్పుడే సమాజంలో నిలదొక్కుకోగలదు.

ఆడ పిల్లలను రక్షించుకుందాం

• స్రవంతి, డీసీపీవో, కామారెడ్డి



పుట్టిన ప్రతీ ఆడపిల్లను రక్షించుకుని సమాజాన్ని కాపాడుకుందాం. ప్రస్తుతం పలు చోట్ల కడుపులో ఉన్నది ఆడ పిల్లని తెలిస్తే మొగ్గలోనే తుంచేసే ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల బాల్య వివాహాలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీటన్నింటిపై ఎప్పటికప్పుడు శాఖా పరంగా నిఘా ఉంచుతూ ఆడ పిల్లలను అడుగడుగునా కాపాడే ప్రయత్నం చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఆడ పిల్లలను భారంగా కాకుండా బాధ్యతగా కాపాడుకోవాలి.

మహిళలు పురుషులకు సమానంగా పోటీ పడాలి

• గడ్డం ఇందుప్రియ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, కామారెడ్డి



మహిళలు అన్ని రంగాల్లో ముందుంటూ పురుషులకు సమానంగా పోటీ పడాలి. ఆ ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం స్థానిక సంస్థల్లో సైతం 50 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ మహిళలను ప్రోత్సహిస్తోంది. మహిళలు చదువులోనే కాకుండా సామాజిక స్పృహను పెంపొందించుకొని ప్రజలకు సేవ చేయడానికి ముందుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమాజంలో జరుగుతున్న వివిధ విషయాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే ఏ రంగంలోనైనా రాణించే అవకాశం ఉంటుంది.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోంది

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతూ అమలు చేస్తుందని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1977, మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం జరిగిందని, మహిళ శిశు దివ్యాంగుల వయోవృద్ధుల శాఖలోని మహిళా సాధికారత కేంద్రం బేటీ బచావో బేటీ పడావో 10 సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. మహిళలు ఇంట్లో, బయట కూడా అన్ని రంగాల్లో ముందున్నారని తెలిపారు. ప్రతీ పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌ను నియమించడం జరిగిందని, 1100 మంది చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు పని చేస్తున్నారని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. పిల్లల భవిష్యత్తుకు హార్డ్‌వర్క్ చేయాలని అన్నారు. అనంతరం నేషనల్ లెవల్ స్పోర్ట్ అండ్ గేమ్స్ విద్యార్థులకు, జిల్లా స్థాయిలో డిగ్రీ ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు, కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఉద్యోగినులు తదితరులకు బెస్ట్ ఎంప్లాయీస్ అవార్డు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి, న్యాయాధికారి నాగరాణి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఏఎస్పీ చైతన్యరెడ్డి, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఫరీదా, డీఆర్‌డీవో పీడీ సురేందర్, డీసీపీవో స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్పీ చైతన్యారెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

బీబీపేట: మండలంలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం పర్యటించారు. తిమ్మయ్యగారి నారాయణరెడ్డి సుశీల జిల్లా పరిషత్ పాఠశాలలోకి కలెక్టర్‌కు ప్రధానోపాధ్యాయుడు రవీంద్రరెడ్డి మండల ఎంఈవో అశోక్ స్వాగతం పలికారు. పాఠశాల పరిసరాలను తరగతి గదులను పాఠశాలల్లో నిర్వహిస్తున్న కంప్యూటర్ ల్యాబ్ సైన్స్ ల్యాబ్‌ల గురించి పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ అవగాహన కల్పించారు. త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాల అయినప్పటికీ సౌకర్యాలు కల్పించడం, మధ్యాహ్న భోజనం నిర్వహణ ఎలా జరిపిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో గల మంచినీటి బావిని పరిశీలించి నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటిని పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. మంగళవారం, శుక్రవారం మొక్కలకు నీటిని పోయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చందర్‌నాయక్, మండల ప్రత్యేకాధికారి సతీష్‌యాదవ్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీవో అబ్బగౌడ్, ఏపీవో రజిని తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీగా రాజేష్‌చంద్ర

- భువనగిరి నుంచి బదిలీపై వస్తున్న రాజేష్‌చంద్ర
- ప్రస్తుత ఎస్పీ సింధూశర్మ ఇంటలిజెన్స్ ఎస్పీగా బదిలీ
- ఏడాదిన్నర పాటు జిల్లాలో ఎస్పీగా విధులు
- అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించిన సింధూ



కామారెడ్డి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా ఎస్పీగా రాజేష్‌చంద్రను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 21 మంది ఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేయగా ఇందులో కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ కూడా ఉన్నారు. కామారెడ్డి ఎస్పీ సింధూశర్మను ఇంటలిజెన్స్ ఎస్పీగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో జిల్లా ఎస్పీగా రాజేష్‌చంద్రను ప్రభుత్వం నియమించింది. 2015 సివిల్ సర్వీస్‌కు చెందిన రాజేష్‌చంద్ర ప్రస్తుతం రాచకొండ కమిషనరేట్ పరిధిలోని యాదాద్రి భువనగిరి డీసీపీగా పని చేస్తున్నారు. అంతకు ముందు 2021లో ఆదిలాబాద్ ఇన్‌చార్జ్ ఎస్పీగా, 2020లో భద్రాచలం ఏఎస్పీగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం భువనగిరి డీసీపీగా ఉన్న రాజేష్‌చంద్ర జిల్లా ఎస్పీగా బదిలీపై వస్తున్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కామారెడ్డి జిల్లాకు రానున్నారు. ప్రస్తుతం కామారెడ్డి ఎస్పీగా ఉన్న సింధూశర్మ ఇంటలిజెన్స్ ఎస్పీగా బదిలీపై వెళ్లనున్నారు. సింధూశర్మ 2023 అక్టోబరులో మమునూర్ నాలుగో బెటాలియన్ నుంచి బదిలీపై కామారెడ్డి జిల్లాకు వచ్చారు. సుమారు ఏడాదిన్నర పాటు జిల్లాలో విధులు నిర్వహించారు. 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను, 2024 ఏప్రిల్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ తరపున తనకంటూ ఒక ప్రత్యేకతను ఏర్పాటు చేశారు. నేరాల నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించి నివారణ చర్యలు చేపట్టారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం



టీటీడీలో శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

బీర్కూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ శివారులోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో అంగరంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ముక్కోటి దేవతల సాక్షిగా శ్రీదేవి భూదేవి సమేత, శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. శ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారి పర్యవేక్షణలో వేద పండితులు పెళ్లి తంతును నిర్వర్తించారు. వేద మంత్రోచ్చరణల మధ్య శ్రీవారి కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మకర్తలు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, శంభురెడ్డి దంపతులు శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కల్యాణ మహోత్సవాన్ని భక్తులు కనులారా తిలకించి తరించారు. గోవిందా గోవిందా నామస్మరణతో భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. పెళ్లి ఘట్టం ముగిసిన అనంతరం శ్రీవారు హనుమాన్ వాహనంపై ఆసీనులై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీవారు ఆసీనులైన రథాన్ని భక్తులు తాళ్లతో లాగుతూ ముందుకు సాగారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహ, ఆలయ కమిటీ సభ్యులు పోచారం రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అప్పారావు, మురళి, నరసరాజు, సత్యనారాయణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారికి అమ్మ వార్లకు పట్టు వస్త్రాలు తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే పోచారం



భక్తులకు ఉపదేశం ఇస్తున్న స్వామీజీ

గురువుని దైవంగా భావించాలి

• స్వామి నరేంద్రాచార్య మహరాజ్

మద్నూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జుక్కల్ మండలం తెలంగాణ ఉప పీఠంలో రెండవ రోజు శుక్రవారం జగద్గురు నరేంద్రాచార్య మహరాజ్ భక్తులనుద్దేశించి మార్గదర్శనం చేశారు. మన ధర్మం ప్రకారంగా గురువే దైవంగా భావించి భక్తి చేస్తూ మోక్షం పొందాలని భగవద్గీత, జ్ఞానేశ్వర్ మహరాజ్, దాస్ బోద్‌లో కూడా గురువే దేవుడిగా చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. మీ మన జీవితంలో గురువును చేసుకునే ముందు సద్గురు యొక్క పేరులో సామర్థ్యం, వాణిలో సామర్థ్యం, దృష్టిలో సామర్థ్యం, శక్తిలో సామర్థ్యం ఉన్న సద్గురునే గురువు వద్ద దీక్ష తీసుకుని జీవితం ధన్యం చేసుకోవాలని అన్నారు. గురుదీక్ష తీసుకున్నవారు జీవితంలో సుఖం వచ్చినప్పుడు సంతోషాం, దుఃఖం వచ్చినప్పుడు బాధ పడవద్దన్నారు. ఇదే గురువు యొక్క పరీక్ష కాబట్టి గురు మార్గంలో ఉన్నవారు జీవితంలో సుఖపడగలరని పేర్కొన్నారు. సంత్ నాందేవ్ మహరాజ్ ఇచ్చిన సందేశం ప్రకారం గురువు చేసుకుంటేనే జీవితం ధన్యమని లేకపోతే జీవితమే వ్యర్థమని అన్నారు. వేలాదిమంది భక్తులు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ నుంచి ఉప పీఠానికి చేరుకొని స్వామీజీ దర్శనం చేసుకున్నారు.

నాగాపూర్‌లో కుక్కలదాడిలో 12 గొర్రెల మృతి

కమ్మర్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగాపూర్‌లో గురువారం రాత్రి బసకొండ బాలమల్లేష్‌కు చెందిన గొర్రెల కొట్టంపై వీధి కుక్కలు దాడిచేశాయి. 12 గొర్రెలను కొరికి చంపివేయగా మరో 15 గొర్రెలు తీవ్రంగా గాయపడినట్లు బాధితుడు తెలిపాడు. వీటివిలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపారు. ఎంపీడీవో సంఘటన స్థలాన్ని సందర్శించారు. పశువైద్యసిబ్బంది గాయపడిన గొర్రెలకు చికిత్స అందించింది. గురువారం రాత్రి బాల్కొండ మం డలం కిసాన్‌నగర్ నుంచి 36 గొర్రెలను 3 లక్షల 75 వేలకు కొనుగోలు చేసి తెచ్చానని, అంతలోనే ఇలా జరిగిపోయిందని బాధితుడు మల్లేష్ కన్నీటి పర్యంతమయ్యాడు.

చెరువుల కబ్జాపై ఫిర్యాదు

ఎడపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో గతంలో ఉన్న రాయకుంట చెరువు, కొత్తకుంట చెరువులు కబ్జా అయ్యాయని శుక్రవారం పలువురు ఫిర్యాదు చేశారు. మంగళ్‌పాడ్ గ్రామ గంగపుత్ర సంఘం సభ్యులు శుక్రవారం ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్‌తో పాటు బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతోకు, ఎడపల్లి ఎస్సైకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయకుంట చెరువు 70 ఎకరాలతోపాటు దాని గొలుసు చెరువు అయిన కొత్త కుంట చెరువు 40 ఎకరాలను సైతం కబ్జా చేశారని వారు అన్నారు. మంగల్‌పాడ్ గ్రామ గంగపుత్ర సంఘ సభ్యులు రాజు, గంగాధర్,రాములు, పోశెట్టి, సాయిలున్నారు.

'మాట తప్పిన ఎమ్మెల్యే రాజీనామా చేయాలి'

ఎడపల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : నిజాంషుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించి పూర్వవైభవం తెస్తానని హామీ ఇచ్చి మాటతప్పిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని నూతన బస్టాండు వద్ద శుక్రవారం ఆయన దిష్టిబోమ్మను దహనం చేశారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు కందగట్ల రాంచందర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజేపి జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, బిజేపి నాయకులు గెంటే శ్రీనివాస్ యాదవ్, కంజరి ప్రదీప్ కుమార్, సంతోష్, అభిలాష్, గంగాధర్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎడపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఎడపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని పలు సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎడపల్లి ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. బోధన్ రూరల్‌లో కల్దుర్కి, సంగెం, ఎడపల్లి మండలంలోని ఎడపల్లి, రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలి సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నవీపేట్ : మండలంలోని రాంపూర్, నాళేశ్వర్ 33/11సబ్ స్టేషన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్, ఎలికే ఫారం, ఫత్తేనగర్, దర్యాపూర్ తండా, ఫస్ట్ ప్లాట్ గ్రామాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని, నాళేశ్వర్ 33/11సబ్ స్టేషన్ పరిధిలో నాళేశ్వర్, తుంగిని గ్రామాలలో మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందన్నారు.

మట్కారాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న పలువురిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. అందిన సమాచారం మేరకు మట్కా నిర్వహిస్తూ, ఆడుతున్న సునీత, సతీష్, గణేష్, ఇర్ఫాన్, నదీమ్, గోపిలను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.13వేల నగదు, ఆరుసెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

'లబ్ధిదారులు ఇళ్ల పనులు ప్రారంభించాలి'

కమ్మర్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పథకంలో ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు యుద్ధప్రాతిపాదికన పనులు ప్రారంభించుకోవాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో నాగాపూర్ గ్రామ ప్రత్యేక అధికారి రాజా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీలో లబ్ధిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేస్‌మిట్ లెవల్ వరకు నిర్మించుకుంటే లక్ష రూపాయలు లబ్దిదారుల ఖతాల్లో చేరుతాయన్నారు. నిర్మాణ పనులు ప్రారంభించుకోవడానికి లబ్ధిదారులకు ఆర్థికస్థోమతలేని లబ్ధిదారులకు తమతమ మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయాలు కల్పించాలని ఆయా సంఘాల సమాఖ్య కార్యవర్గసభ్యులు చూపాలన్నారు.

'ప్లాస్టిక్‌ను వాడవద్దు'



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆర్మూర్‌టౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ప్రతీఒక్కరూ తక్కువ మైక్రేన్ గల ప్లాస్టిక్‌ను వాడవద్దని మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 16 వార్డులో తడిపొడి చెత్త, హానికరమైన చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీఒక్కరు చెత్తను మున్సిపల్ ట్రాక్టర్‌లో వేసి, కాలనీని శుభ్రంగా ఉంచుకోవా లని ఆయన సూచించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ సర్వేక్షన్ 2024 ఫీడ్‌బ్యాక్‌ను విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్ అవినాస్, మెప్మా ఆర్‌పీ వాణి, మున్సిపల్ సిబ్బంది నరేష్, రవి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు

వేల్పూర్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం హెచ్‌ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నందిని కళాబృందం ఆధ్వ ర్యంలో హెచ్‌ఐవీ నివారణపై కళాబృందం వారు ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నారాయణ, ఆరోగ్యకార్యకర్త రాధిక, ఆశవర్కర్ శ్రీదేవి, కళాకారులు పాల్గొన్నారు.

చారిత్రక స్థలాలను సందర్శించిన విద్యార్థులు

భీమ్‌గల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు హైదరాబాద్‌లోని చారిత్రక స్థలాలను సందర్శించారు. నెహ్రూ, జూపార్కు, గాంధీభవన్ తదితర ప్రదేశాలను సందర్శించారు. వీరి వెంట ఎంఈవో స్వామి, ఉపాధ్యాయులు రఘువాస్, ఇమ్మానియేల్, భూమేశ్వర్, రాధిక, రాణి ఉన్నారు.

ఆల్‌ఇండియా పోలీస్‌గేమ్స్‌కు ఎంపిక

జక్రాన్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఆల్‌ఇండియా పోలీస్‌గేమ్స్‌కు కలిగోట్‌కు చెందిన పూర్వవిద్యార్థి, ఏఆర్ కానిస్టేబుల్ వెంకటేష్ ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి తెలిపారు. రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా పోలీస్‌గేమ్స్‌కు ఎంపికయ్యారని తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కోటగిరి,మార్చి7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం మోక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులను, మధ్యాహ్న భోజన నిర్వాహకులను, పాఠశాలలో పని చేస్తున్న ఆయమ్మలను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ రావు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు బర్ల సాయిలు, కిడ్స్ సభ్యులు తాటి వీరేశం పాల్గొన్నారు. పొతంగల్ మండల కేంద్రంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డ్వాక్రా మహిళాసంఘాలు బ్యాంకు నుంచి రుణాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు సకాలంలో చెల్లించాలని పొతంగల్ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ సూచించారు. పొతంగల్ మండల కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వయం సహాయక సంఘాలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మల్లికార్జున శెట్టి పాల్గొన్నారు.

మోర్తాడ్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ముఖ్యఅతిథి ప్రిన్సిపాల్ పెద్దన్న మాట్లాడుతూ మహిళలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉన్నారన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ మర్రిపల్లి భూపతి, కోఆర్డినేటర్ దశరథ, డాక్టర్ బ్యూల, మహిళ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్ : మండలంలోని చేపూర్‌లో గల క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వివిధ అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్‌కె.పాండే మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమన్నారు. మాజీమున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పాల్గొన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగుమీడియం ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



కోటగిరిలో మహిళా ఉపాధ్యాయుల సన్మానం

వేల్పూర్ : మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కేంద్రంలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులు యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో రేణుక ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మండల ఎస్‌టీజీ యూనియన్ అధ్యక్షులు శ్యామ్ సుందర్, ప్రధానకార్యదర్శి సునీల్, క్యాషియర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



వేల్పూర్‌లో సన్మానం పొందిన మహిళా ఉపాధ్యాయులు



పొతంగల్‌లో..

బోధన్‌రూరల్ : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని 5వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్. రవికుమార్ అన్నారు. శుక్రవారం బోధన్ కోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి అజయ్ కుమార్, అదనపు ప్రథమ శ్రేణి న్యాయాధికారి సాయి శివ, ద్వితీయ శ్రేణి న్యాయాధికారి శేషతల్ప సాయి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్ రావు, డాక్టర్ సమ్మయ్య, సీహెచ్‌వీ హన్మంత్ రావు ఉన్నారు.



పెర్కిట్‌లో...

బోధన్‌లో సబ్‌కలెక్టర్ ఆకస్మిక పర్యటన

బోధన్‌రూరల్,మార్చి7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో పట్టణంలోని పలు వార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా వార్డులలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్ టాకీస్ పక్క నుంచి తట్టికోటకు పోయే రోడ్డుమార్గంలో ఉన్న కల్వర్టును పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న కల్వర్టులను వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. శక్కర్‌నగర్ ఎన్‌ఎస్‌ఎఫ్ గ్రౌండ్‌ను, క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. 23వ వార్డులో గల నర్సరీని పరిశీలించారు.

ప్రభుత్వ పాఠశాలల ఆకస్మిక తనిఖీ

బోధన్ మండలంలోని సంగం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలతో పాటు వివిధ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం బోధన్ మండల విద్యాధికారి నాగయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని అన్ని తరగతులలో బోధనను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ, సంధ్య వెంకటలక్ష్మి, వసుంధర, ప్రవంతిలతో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



స్థలాలను పరిశీలిస్తున్న బోధన్‌లో సబ్‌కలెక్టర్

పీహెచ్‌సీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): అంకాపూర్‌లో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని హరితహారం నర్సరీ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రభవన నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హారిక, సర్వేయర్ రత్నకర్, ఆర్‌ఐ ఉన్నారు. గ్రామాలలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అంకాపూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

రెంజల్,మార్చి7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సోదరభావంతో పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో రైతు వేదికలో శాంతికమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు పండుగలను శాంతియుతవాతావరణంలో జరుపుకుని సోదరభావంతో మెలిగినప్పుడే పండుగలు ప్రశాంతంగా జరుపుకున్న వారమవుతారని ఆయన అన్నారు. రంజాన్ పండుగ దృష్ట్యా శాంతికమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. అందరు కలిసి మెలిసి పండుగలను జరుపుకోవాలని, శాంతి భద్రలకు ఎలాంటి విఘాతం కలిగించకూడదని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సాయన్న, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బినోలలో పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

నవీపేట,మార్చి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోలలో శ్రీ సింధూర సిద్ధి వినాయక స్వామి ఆలయ జీర్ణోద్ధరణ, పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వీటితో పాటు పాటు శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి, శ్రీ రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ పుష్కర కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి భక్తులకు ప్రవచనలు అందజేశారు. కార్యక్రమంలో పురోహితులు కృష్ణప్రసాద్ జోషి పాల్గొన్నారు.

తొర్లికొండలో విగ్రహాల ప్రతిష్ఠాపన

జక్రాన్‌పల్లి : మండలంలోని తొర్లికొండలో శుక్రవారం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలను గ్రామస్థులు భక్తిశ్రద్దలతో జరుపుకున్నా రు. స్వామివారి విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్ళి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, బ్రాహ్మణ్‌పల్లి సింగిల్‌విండో చైర్మన్ కాట్‌పల్లి నర్సారెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రవచనాలు ఇస్తున్న పీఠాధిపతి

ధర్మోరాలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే



బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ధర్మోరాలో నూతనంగా నిర్మించిన వేంకటే శ్వరస్వామి దేవాలయంలో ప్రతిష్ఠాపన కార్య క్రమంలో మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుద ర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆలయాన్ని ప్రారంభోత్సవం చేశారు. బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు లోక భూపతిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మొదటి రోజున ముస్కు అనుప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులతో యజ్ఞం నిర్వహించారు. ముఖ్యఅతిథి లుగా ముస్కు అనుప్‌కుమార్ ఆధ్వర్యంలో మహా గణపతిపూజ, హారతి, మంత్రపుష్పం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని ధర్మోరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాలుగు గదుల నిర్మాణానికి ముస్కు అనుప్‌కుమార్‌రెడ్డి రూ.12లక్షల వితరణ చేయగా బోధన్ ఎమ్మెల్యే, మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి పనులకు భూమిపూజ చేశారు. అనుప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గుడికి, బడికి పెద్దఎత్తున విరాళం ఇచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించిన ముస్కు అనుప్‌కుమార్‌రెడ్డిని అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు రఘునందాచారి అనుప్‌కుమార్‌రెడ్డిని, ఆయన తండ్రి ముస్కురాజేశ్వర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు అనుప్‌కుమార్‌రెడ్డి ఐదేళ్లుగా విద్యావాలంటీర్లకు ప్రతీనెల రూ.10 వేల చొప్పున చెల్లిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు భూపతిరెడ్డిలు ప్రసంగిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న అనుప్‌కుమార్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వడ్లగంగాధర్, యోగేష్‌గౌడ్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మిట్టపల్లి దేవేందర్, ముస్కు రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పతాని గంగాధర్, రవికాంత్, గణేష్‌గౌరవ్, క్రాంతికుమార్, టి.రాజేశ్వర్, శ్రీనివాస్, హన్మాండుల, నాగమణి, రేణుక నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేయాలి..

ఆర్మూర్‌టౌన్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మోర్తాడ్ మండలం ధర్మోరాకు వెళ్తున్న సుదర్శన్‌రెడ్డిని ఆర్మూర్ అంబేద్కర్‌చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పట్టుశాలువతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, కాంగ్రెస్ నాయకులు అయ్యప్పశ్రీనివాస్, చిట్టిరెడ్డి, నర్మేశ్రీనివాస్, విజయ్‌అగర్వాల్ పాల్గొన్నారు.

ఎంపీ ధర్మపురి అరవింద్ దిష్టిబొమ్మ దహనం

నవీపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ దిష్టిబొమ్మను శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిపై ఎంపీ అరవింద్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, భగవాన్, చల్లా రవీందర్ తదితరులున్నారు.

'అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పూర్తిచేయండి'

కోటగిరి,మార్చి7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అసంపూర్తిగా మిగిలిన అంగన్‌వాడీ కేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగడంపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో జిల్లా పరిషత్ పాఠశాల అవరణలో అంసపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం బీజేపీ నాయకులు సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మద్యం సీసాలు, పేక ముక్కలు దర్శనం ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భవనానికి నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్, భజరంగ్ హన్మాండ్లు, శ్యామ్, రాజు, సాయిలు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి'

కోటగిరి,మార్చి7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదివి, ఉన్నతస్థాయికి ఎదగాలని కోటగిరి ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని ఎత్తొండ జిల్లా పరిషత్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పొతంగల్ ఎంఈవో లోల శంకర్, ప్రధానోపాధ్యాయురాలు అలివేలు, ఉపాధ్యాయులు సాయిలు, నవీన్ పాల్గొన్నారు.

'ఆశా వర్కర్‌పై అత్యాచారం చేసిన దుండగుడిని శిక్షించాలి'

కోటగిరి,మార్చి7(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో ఆశా వర్కర్‌పై అత్యాచారం చేసిన దుండగుడిని శిక్షించాలని ఆశా యూనియన్ అధ్యక్షురాలు భూలక్ష్మి డిమాండ్ చేశారు. రుద్రూరు మండల కేంద్రంలో ఆశా యూనియన్ కార్యకర్తలు శుక్రవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్‌పై అత్యాచారానికి ఒడిగట్టిన దుండగుడిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు వాణి, లత, లక్ష్మి పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నల్లాలకు బిగించిన మోటార్లు సీజ్

భీమ్‌గల్‌రూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనుగొప్పుల గ్రామంలో మిషన్ భగీరథ నల్లాలకు మోటార్లు బిగించి నీటని వృథా చేస్తున్న వారికి శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఎనిమిది మోటార్లను సీజ్ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటిని పొదుపుగా ఉపయోగించుకోవాలని, నల్లాలకు మోటార్లు బిగిస్తే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన ప్రజలకు హెచ్చరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జక్రాన్‌పల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను శుక్రవారం జక్రాన్‌పల్లి మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు సుమారు రూ.40 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఈ నిధులు మంజూరు చేయించిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జక్రాన్‌పల్లి మాజీసర్పంచ్ కాట్‌పల్లి నర్సారెడ్డి, నిజామాబాద్‌రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, జనరల్ సెక్రెటరీ గన్న లక్ష్మణ్, మండల మైనారిటీ అధ్యక్షుడు అక్బర్, మాజీవైస్‌ఎంపీపీ జితేందర్‌నాయక్, డిష్‌రాజు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఒకరికి గాయాలు

రెంజల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): రెంజల్ శివారులో డీసీఎం ఢీకొని ద్విచక్రవాహనదారుడు నరక సత్యనారాయణకు గాయాలయ్యాయని ఎస్‌ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణ ఉదయం తన ద్విచక్ర వాహనంపై నవీపేటకు వెళ్తుండగా కళ్యాపూర్ చౌరస్తాలో ఎదురుగా డీసీఎం వాహనం అతివేగంగా ఢీకొట్టింది. అజాగ్రత్తగా నడుపుతూ ఢీకొనగా సత్యనారాయణకు గాయాలయ్యాయి. డీసీఎం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

చికిత్స పొందుతూ అటెండర్ మృతి

బోధన్‌రూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న పల్లపు గంగాధర్ చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు బోధన పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. బుధవారం యాసిడ్ సేవించి అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఇంటికి తీసుకెళ్లారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. చికిత్స పొందుతూ బోధన్‌లో గురువారం మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుడి తల్లి పల్లపు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామన్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారని ఆయన తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

రెంజల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి గోదావరిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. కందకుర్తి గోదావరిలో మహిళ మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని జాలర్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

'నవోదయ పాఠశాలను తరలించొద్దు'

జక్రాన్‌పల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): మంజూరైన జవహర్ నవోదయ పాఠశాలను కలిగోట్ గ్రామంలోనే ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జక్రాన్‌పల్లిలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వంశీగౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్‌లు కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎంపీ అర్వింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు రాజేందర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు డాక్టర్ సంజీవ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి అర్బన్ ఎమ్మెల్యే విరాళం



విరాళాన్ని అందజేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

రెంజల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సాటాపూర్‌లో నిర్మిస్తున్న రామాలయానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా 25 వేల రూపాయల విరాళాన్ని రామాలయ కమిటీ చైర్మన్ నితిన్‌కు అందజేశారు. మేక సంతోష్, కుర్మె సాయిలు, ప్రేమ్‌కుమార్, కమటం గంగారాం తదితరులున్నారు.

ఆమే ఆకాశం.. వనితకు వందనం!

● అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

ఆర్మూర్‌రూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): కర్యేషుదాసి, కరణేషుమంత్రి, భోజ్యేషుమాత, శయనేషు రంభ అని ఒక సినికవి చెప్పినట్టు ప్రతీ మగాడి విజయంలో స్త్రీ పాత్ర లేనిది అతనికి మనుగడే లేదు. సమాజ నిర్మాణంలో సగ భాగమైన స్త్రీ సమానత్వమే ప్రగతికి మూలం ఇదే నినాదంతో ఐక్య రాజ్య సమితి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతీఏటా నిర్వహిస్తోంది. మహిళ ఒక అమ్మగా జన్మనిస్తుంది. భార్యగా బాధ్యతలు మోస్తుంది. అక్కగా కష్టాల్లో తోడుంటుంది. కూతురిగా ప్రేమను పంచుతుంది. ఇలా ఎన్నో విధాలుగా కర్తవ్యాలను మహిళలు నిర్వర్తిస్తున్నారు. పుట్టిన నాటి నుంచి ప్రాణం పోయే వరకు తనంటేనే సేవ అంటూ పురుషులకు ప్రేమను అందిస్తుంది. ప్రతీ విషయంలో పురుషులకు చేదోడు వాదోడుగా ఉంటూ ధైర్యాన్ని ఇస్తుంది. ప్రతిఫలంగా కొంచెం ప్రేమను, ఓదార్పును మాత్రమే కోరుకుంటుంది స్త్రీమూర్తి. ఇలా అకాశంలో సగభాగంలా నిలిచిపోయింది.

రంగమేదైనా మహిళలదే కీలకపాత్ర..

అన్ని రంగాలలో మహిళలు తమ సత్తాను చాటుతూ ఉన్నత శిఖరాలకు చేరుకొని పురుష శక్తికి తమేమి తీసుకుపోమని చాటుచెబుతున్నారు. తాము ఇంటికే పరిమితం కాదంటు పురుషులకు దీటుగా విజయం సాధిస్తున్నారు. విద్య, వైద్యం, వ్యాపారం, క్రీడలు, రాజకీయాలు ఇలా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తూ మహిళ సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు.

సర్పంచ్‌లుగా.. వ్యవసాయదారులుగా..

● సట్లపల్లి సవిత, సట్లపల్లి గంగ నర్సుబాయి, మాజీ సర్పంచ్‌లు



మహిళలు వ్యవసాయ రంగంలోనే కాకుండా అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ రాజకీయ రంగాల్లో కూడా రాణిస్తున్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా ఎంపీపీలు, జడ్పీటీసీలుగా తమ దైన శైలిలో రాణిస్తున్నారు. వ్యవసాయ కుటుంబాలకు చెం దిన పలువురు వ్యవసాయం పనులు చేస్తునే ప్రజా ప్రతినిధులుగా పనిచేసి గుర్తింపు తెచ్చుకు న్నారు. మహిళలు ఎవరికి తీసిపోరాని అన్ని రంగాల్లో రాణిస్తూ నిరూ పిస్తున్నారు. సుర్బి ర్యాల్ గ్రామానికి చెందిన సట్లపల్లి సవిత, సట్లపల్లి గంగనర్సుబాయి తోటికోడళ్లు. ఒక వైపు వ్యవసాయం చేస్తునే సర్పంచ్‌లుగా రాణించారు.

వ్యవసాయంలో మహిళలదే ప్రధానపాత్ర..

● సుప్రియ, రైతు, రాంపూర్



వ్యవసాయ రంగంలో మహిళలే ప్రధాన పాత్ర. ఆర్మూర్ ప్రాంతం వ్యవసాయంలో దేశంలోనే పేరుగాం చడం వెనుక మహిళల కృషి ఎంతో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు వ్యవ సాయంతో పాటు విద్య, వైద్యం, క్రీడలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. తాను ఉన్నత విద్యనభ్యాసించినప్పటికీ వ్యవసాయం చేస్తూ కుటుంబానికి చెదోడువాదోడుగా నిలుస్తున్నాను.

సీజనల్ వ్యాపారాలు చేస్తూ రాణిస్తున్న మహిళ..

● పొన్నాల స్పందన, ఆర్మూర్



ఆర్మూర్ పట్టణానికి చెందిన పొన్నాల స్పందన సీజనల్ వ్యాపారాలు చేస్తూ కుటుంబానికి చెదోడు వాదోడుగా ఉంటూ అదనపు ఆదాయం అర్జిస్తుంది. సంక్రాంతి పర్వదినాల్లో గాలిపటాలు, రాఖీ పౌర్ణమి నాడు రాఖీలు అమ్ముతూ, హోలీ నాడు రంగులు అమ్ముతూ, దీపావళికి నాడు బాణసంచాలు, విక్రయిస్తూ వ్యాపారంలో రాణిస్తుంది. స్పందన గతంలో మహిళ సంఘంలో రూ.10వేల రుణం తీసుకొని వ్యాపారం ప్రారంభించి ప్రస్తుతం రూ.2లక్షల బ్యాంకు రుణాల ద్వారా వివిధ వ్యాపారాలు నిర్వహిస్తోంది. గత 13ఏళ్లుగా సీజనల్ వ్యాపారాలు చేస్తూ రాణిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుంది.

అతివలు... ఆదర్శప్రాయులు

మద్నూర్: ఉద్యోగ నిర్వహణలో తమ బాధ్యతలను చక్కగా నిర్వహిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలానికి చెందిన పలువురు అధికారులు ఒకప్పుడు పురుషులకే పరిమితమైన రాజకీయాల్లో నేడు సగానికి పైగా మహిళలు సమయస్ఫూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి మ ద్నూర్ మండలంలో ప్రభుత్వ పాలనలో మహిళలదే అగ్రరాజ్యం. పురుషులతోపాటు మేము సైతం అంటూ అన్ని రంగాల్లో రాణిస్తూ మద్నూర్, డోంగ్లి మండలాల్లో ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ అధికారులుగా, ప్రజా ప్రతినిధులుగా మహిళలు ప్రాధాన్యత వహిస్తున్నారనే చెప్పవచ్చు. మండల స్థాయిలో మహిళా అధికారినులు పాలన వ్యవహరిస్తూ పదవులకు ఆదర్శంగా నిలిచారు. ఎంపీడీవో రాణి, డోంగ్లి మండల తహసీల్దార్ రేణుక చౌహాన్, ఏపీవో పద్మతో పాటు డోంగ్లి పిహెచ్‌సి వైద్యురాలు శ్రీలేఖ మహిళా అధికారులుగా పలు శాఖల్లో వ్యవహరిస్తున్నారు. మద్నూర్ మార్కెట్ చైర్ పర్సన్‌గా సౌజన్య రమేష్ రైతుల ఇబ్బందులు తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సాధికారిక సాధించవచ్చని వీరు రుజువు చేస్తున్నారు. మహిళా ఇంటికి పరిమితం కాదు సమాజంలో పురుషులకంటే తామేమి తక్కువ కాదని నిరూపిస్తున్నారు. మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందాలి పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు ఉండాలి ఏదైనా సమస్య వస్తే ధైర్యంగా ఎదుర్కోవాలి ఆడపిల్లలనే చులకన భావం భావం సమాజంలో పోవాలి అంటున్నారు. మహిళా ఉద్యోగులు నేడు ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

స్వశక్తితో ఎదగాలి

● పద్మ ఏపీవో



ప్రతీ మహిళ స్వశక్తితో ఎదగాలి. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి. ఉద్యోగం, కటుంబం సామాజిక పరంగా సమానమైన బాధ్యత కలిగి ఉండాలి. సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెంది నైపుణ్యం కలిగి ఉండాలి. అక్షరాస్యత కలిగి ఉండాలి. ఉన్నత చదువులు చదువుకోవాలి. ఏదైనా సాధించే శక్తి మహిళల్లో ఉంది.

● ధైర్యంగా ఎదుర్కొవాలి: రాణి, ఎంపీడీవో



ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలి. ఎదుర్కొనే ధైర్యం మహిళల్లో ఉంటుంది. కాని అది గుర్తించం. అడ పిల్లలనే చులకన భావన సమాజంలో ఉండకూడదు. పోరాడే శక్తి మహిళల్లో ఉంది. ప్రతి అంశంలో మహిళలు పురుషులు సమానమే.

అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలి

● రేణుక చౌహాన్, తహసీల్దార్, డోంగ్లి



అన్ని రంగాలలో మహిళలు ముందుండాలి. ఉద్యోగం. క్రీడలతో పాటు అన్ని రంగాలలో చైతన్యం కలిగి ఉండాలి. కుటుంబ నిర్వహణలో బడ్జెట్ అనే పదానికి మారుపేరే మహిళ. ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలి.

అందుబాటులో ఉండాలి

● సౌజన్య మార్కెట్ కమిటీ చైర్మన్



ప్రజలకు, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించినప్పు డే మంచి పేరు వస్తుంది. మార్కెట్‌లో రైతులకు ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నాను. అదేవిధంగా ప్రజా ప్రతి నిధులు సైతం ప్రజా సమస్యలను పరిష్కరించడానికి శాయాశక్తులా కృషి చేయాలి

పట్టుదలతో ప్రభుత్వ కొలువు

● లావణ్య, ఏవో, భీమ్‌గల్



భీమ్‌గల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మంచి ప్రణాళిక ద్వారా లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ఆ దిశగా చదువులో ముందుకు సాగితే అనుకున్నది సాధించవచ్చు అని భీమ్‌గల్ పట్టణ కేంద్రానికి చెందిన లావణ్య ఏవో గా కొలువు సాధించి ఆదర్శంగా నిలిచింది. పట్టణ కేంద్రానికి చెందిన బద్దం లింగయ్య అనసూయకు దంపతుల కూతురు లావణ్యకు చిన్నప్పటి నుంచి చదువుపై ఉన్న మక్కువను గమనించి తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు. పదవ తరగతి వరకు పోచంపాడ్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువు పూర్తి చేసిన ఆమె ఇంటర్మీడియేట్ దర్మారంలో పూర్తిచేసింది. పై చదువుల నిమిత్తం హైదరాబాద్‌లోని ఆచార్య ఎన్‌జీ.రంగా యూనివర్సిటీలో డిగ్రీ అగ్రికల్చర్ బీఎస్సీ అదే యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తి చేసి ప్రభుత్వ ఉ ద్యోగం సాధించేందుకు ప్రాతినిత్యం కష్టపడింది. 2009లో ఏవో (అగ్రికల్చర్ ఆఫీసర్)గా ఉద్యోగం సాధించి నందిపేట్‌లో బాధ్యతలు చేపట్టింది. అనంతరం మోర్తాడ్, బాల్కొండ, ప్రస్తుతం భీమ్‌గల్ ఇన్‌చార్జీగా పనిచేస్తున్నారు. ఉత్తమ ఏవోగా పప్పటి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని కూడా అందుకున్నారు. 2008లోనే పట్టణ కేంద్రానికి చెందిన పర్స నవీన్‌తో వివాహమైంది. వీరికి కూతురు కుమారుడు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని పట్టుదలతో ముందుకు సాగాలి. ప్రతినిత్యం గంటల తరబడి చదువుతూ పోటీ పరీక్షలకు సన్నద్దమమయ్యారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించారు.

అటు అంగన్‌వాడీగా.. ఇటు పూజారులుగా రాణిస్తున్న అక్కాచెల్లెళ్లు



ఉద్యోగాలతో పాటు పౌరోహిత్యంలో రాణిస్తున్న అక్కాచెల్లెళ్లు

కమ్మర్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అతివలు ఎందులోనూ తీసిపోరంటూ నిరూపిస్తూ పురుషులతో సమానంగా సమాజంలోని అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. కష్టాల కడలిని ఈదుకుంటూ కృషి, పట్టుదల తమ సొంతమంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. విద్య, వైద్య, ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ, రాజకీయ తదితర అన్ని రంగాల్లోనూ అతివలు మనోధైర్యంతో ముందుకు సాగుతున్నారు. కాగా ఒక వైపు ఐసీడీఎస్ భీమ్‌గల్ సెక్టార్‌లోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లుగా, ఆలయాల్లో పూజారులుగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరో వైపు వంశపారంపార్యంగా వస్తున్న పౌరోహిత్యం లోనూ రాణిస్తున్నారు ఈ అక్కాచెల్లెళ్లు. మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన హన్మాండ్లు పంతులు నర్సూబాయి దంపతుల తొలి నలుగురు సంతానంలో నలుగురు ఆడపిల్లలే అయితే హన్మాడ్లు పంతులు పురోహితుడుగా, పూజారిగా రాణిస్తూనే ఆడపిల్లలకు చదువులు చెప్పించడంతో పాటు పెళ్లిళ్ల, పేరంటాలకు తన వెంట తీసుకునిపోతుండేవారు. ఈ క్రమంలో అటు ఆలయాల్లో పూజలు చేయడం, ఇటు పురోహితులుగా నిర్వహించే కార్యకలాపాలు నేర్చుకున్నారు. పెళ్లిళ్ల తరువాత వారివారి గ్రామాల్లో స్థిరపడ్డారు. పెద్దకూతురు ప్రణవేశ్వరి ప్రస్తుతం చౌట్‌పల్లిలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తూనే.. మరో వైపు గ్రామశివారులోని శ్రీఉమా పార్థీవ కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో పూజారిగా కొనసాగుతున్నారు. రెండో కూతురు రాజేశ్వరి ప్రస్తుతం మోర్తాడ్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తూనే పౌరోహిత్యంలో రాణిస్తున్నారు. మూడో కూతురు భువనేశ్వరి వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇక నాలుగో కూతురు జ్ఞానేశ్వరి మోర్తాడ్ మండలం వడ్యాట్ గ్రామంలో మొదట ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూనే.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగించుకుంటూ గ్రామంలోనే అంగన్‌వాడీ టీచర్‌గా చేరారు. ప్రస్తుతం ఐసీడీఎస్ భీమ్‌గల్ సెక్టార్‌లో ఏసీపీడీవోగా పనిచేస్తున్నారు. మగసంతానం లేని హన్మాండ్లు పంతులుకు ఆడబిడ్డలే కొడుకుల్లా మనోధైర్యం కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు.



పురోహితురాలిగా పెళ్లి జరిపిస్తున్న ప్రణవేశ్వరి

జిల్లా కోర్టులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సంబరాలు చేసుకుంటున్న మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులు

నిజామాబాద్ లీగల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత కుంచాల సూచించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాటాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని పలు సూచనలు చేశారు. మొదటి అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో మహిళల ప్రాధాన్యత గురించి పలు అంశాలు, మహిళా చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం న్యాయసేవా సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ మహిళలు ఇప్పుడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఇంకా చాలా విషయాలలో ఒకరికొకరు తోడ్పాటును అందించు కోవాలన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ మహిళలు ఇంట్లో పనులు చేస్తూ ఉద్యోగ పరంగా ప్రధాన పాత్ర పోషిస్తున్నారని తదితర అంశాల గురించి వివరించారు. అనంతరం మహిళా న్యాయవాదులు అహల్యబాయి, న్యాయదేవత, డాక్టర్ ఆనంద్‌బాయి, జాన్సీబాయి దేశ్‌ముఖ్, మదర్ థెరిస్సా వేషాధారణలు ధరించి మహిళా స్ఫూర్తిని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు, జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిలు, మహిళా న్యాయ వాదులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

● రాజశ్రీ, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారిణి



నేడు మహిళలు అనేక అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు తమ ఆరోగ్య విషయంలో మాత్రం కొంచం జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం అనేక అనారోగ్య సమస్యలు మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా క్యాన్సర్, ఇతరత్ర వ్యాధుల విషయంలో ముందు నుంచి జాగ్రత్తలు వహిస్తే అనారోగ్యబారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు తాను ఇచ్చే సందేశం ఒక్కటే. మహిళలు తమ అనారోగ్య సమస్యలను ఆదిలోనే గుర్తించి చికిత్సలు చేసుకుంటే బాగుంటుంది. - నిజామాబాద్ అర్బన్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● మణిదీపిక, మండల వ్యవసాయశాఖ అధికారిణి దోమకొండ



దోమకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని దోమకొండ మండల వ్యవసాయ శాఖ అధికారిణి మణిదీపిక అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. తల్లిదండ్రుల సహకారంతో ఉనత్న చదువులు చదువుని ప్రభుత్వ ఉద్యోగం సాధించడం గర్వంగా ఉందన్నారు.తాను ఏవోగా ఉద్యోగంలో జాయిన్ అయిన సమయంలో అబ్బాయిలతో సమానంగా 80 మంది అమ్మాయిలు జాయిన్ కావడం జరిగిందని ఆమె తెలిపారు.

మహిళలు అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది

●డాక్టర్ బి.కావ్య, మెడికల్ ఆఫీసర్, నవీపేట



నవీపేట, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఎంతైన ఉందని నవీపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బండారి కావ్య అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. తమ స్వస్థలం బోధన్‌లోని శక్కర్‌నగర్ అని, తండ్రి బండారి వెంకటేశ్వర్లు వ్యాపారవేత్త కాగా తల్లి లక్ష్మి సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో సూపరిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. అక్క చందనకు వివాహం కాగా సోదరుడు శివసాయి అమెరికాలో ఎంఎస్ చదువుతున్నాడని అన్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సహంతో తాను 2015 నుండి 2021వరకు ఖమ్మంలోని మెడికల్ కళాశాలలో మెడిసిన్ చదివానని ఈ సమయంలో మూడు గోల్డ్ మెడళ్లు సాధించినట్లు ఆమె వివరించారు. 2023సంవత్సరంలో తాను ప్రభుత్వ వైద్యురాలిగా నవీపేట ఆసుపత్రిలో నియామకం అయినట్లు ఆమె వివరించారు. సమాజంలో తల్లిదండ్రులు ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా పెంచాలని అప్పుడే దేశంలో మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించడం సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.కావ్య ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

అనతి కాలంలోనే వ్యవసాయ అధికారిగా..

●భానుశ్రీ,మండల వ్యవసాయ అధికారి, రామారెడ్డి



రామారెడ్డి: కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల వ్యవసాయ అధికారి భాను శ్రీ అనేది కాలంలోనే ప్రభుత్వ అధికారిగా నియామక మయ్యారు. సిద్దిపేట జిల్లా మద్దూర్ మండలం నర్సాయిపల్లి గ్రామానికి చెందిన భానుశ్రీ ఎమ్మెస్సీ అగ్రికల్చర్ (మాస్టర్ ప్లాంట్ పాథాలజీ) పోస్టు సాధించి పై అధికారుల చేతు ల మీదుగా ఉత్తమ గోల్డ్ మెడల్ అవార్డును అందు కున్నట్లు ఆమె వివరించారు. చిన్నప్పటి నుండి ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుకున్నానని ఎంఎస్సీ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. గత సంవత్సరం అక్టోబర్ నెలలో రామారెడ్డి మండల వ్యవసాయ అధికారిగా నియమకం అయినట్లు వివరించారు.

కలగా మిగిలిన నిజాంసాగర్ స్విమ్మింగ్ పూల్



నీరు లేక బోసిపోయిన స్విమ్మింగ్ పూల్ ఇదే

● పాలకులు, అధికారులు పూర్వ వైభవం తెచ్చేనా!?

నిజాంసాగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ స్విమ్మింగ్ పూల్ కలావిహీనంగా మారింది. దీంతో పర్యాటకులు నిరాశకు గురవుతున్నారు. పాలకులు, అధికారులు స్విమ్మింగ్ పూల్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నైజాం హయాంలో నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసరాల ప్రాంతంలో దాదాపు ఎకరం భూమిలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణం చేసి జాతికి అంకితం చేశారు. కాలక్రమమైన అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా స్విమ్మింగ్ పూల్ నిర్వహణ సక్రమంగా లేక స్విమ్మింగ్ పూల్ నీరు లేక బోసి పోయింది. ఎండాకాలం వచ్చిందంటే పర్యాటకులు సిమ్మింగ్ పై ఎంతో ఆసక్తి కనబరుస్తూ ఉంటారు. కానీ నిజాంసాగర్ స్విమ్మింగ్ పూల్‌లో దాదాపు 40 సంవత్సరాలు గడుస్తున్న ప్పటికీ పాలకులు, అధికారులు మరమ్మతులు చేయించి స్విమ్మింగ్ పూల్ పునర్ ప్రారంభించాలని ఆలోచన లేక పోవడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. 1986 వరకు నామమాత్రంగా స్విమ్మింగ్ పూల్‌లో నీరు ఉండేవి అప్పట్లో నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించే పర్యాటకులు నిజాంసాగర్ స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్ చేస్తూ ఆహ్లాదకరంగా గడిపేవారు. కాలక్రమేనా ఈ స్విమ్మింగ్ పూల్‌లోనికి వచ్చే పైపులైన్లు శిథిలమై నీరు రాకుండా పోయింది. అధికారులు, పాలకులు చూసిచూడనట్టుగా వివరిస్తూనే ఉన్నారు. కానీ ఎన్నికలు వచ్చాయంటే నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలకు పరిరక్షణంగా తీర్చిదిద్దామని హామీ ఇస్తూనే ఉన్నారు. హామీలు కలగానే మిగిలిపోతున్న పట్టినట్టుగా వివరిస్తున్నట్లు విమర్శలు వినిపి స్తున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు రాజధానిలోని ఎంతో ప్రాముఖ్యత సంతచరించుకున్న పర్యటన కేంద్ర పుణ్య నిర్మాణం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అని చందంగా మారింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి స్విమ్మింగ్ పూల్ మరమ్మతులు జరిపి జాతికి అంకితం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



స్విమ్మింగ్ పూల్‌లోకి దూకేందుకు అప్పట్లో నిర్మాణం చేసిన డైవింగ్



స్విమ్మింగ్ చేసే వారు సేద తీరేందుకు అప్పట్లో నిర్మించిన కాటేజ్

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కామారెడ్డి టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కోర్టులో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ మహిళలు దాదాపు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఇంకా ఉన్నత చదువులు చదువుతూ మంచి ఉద్యోగాలు మంచి పని తీరును కనబర్చాలని తెలిపారు. అనంతరం కేక్ కట్‌చేసి పలువురు లాయర్స్, ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు న్యాయమూర్తి లాల్ సింగ్ శ్రీనివాస్‌నాయక్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, న్యాయశాఖ ఉద్యోగులు రజినిప్రియ, కరుణ, సంధ్యారాణి, ప్రతిభ, షబ్నాబేగం, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో ప్రాంగణంలో టీజీవో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవో అధ్యక్షుడు దేవేందర్, సెక్రెటరీ సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూమయ్య, రాజలింగం, రమేష్, శశికిరణ్, సంతోషి, మౌనిక, జ్యోతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు తహసీల్దార్ ముజీబ్, ఉద్యోగులు సన్మానించారు. మహిళల సాధికారతకు విద్య మూల స్తంభం అని అన్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలో రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలలో ఉత్తమ సేవలు అందిస్తున్న మహిళలకు సన్మానం నిర్వహించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భానుప్రకాష్, ఏఎంసీ వైస్ చైర్మన్ యామ రాములు, మాజీ ఎంపీపీ రఘు, రెడ్‌క్రాస్ జిల్లా నిర్వాహక కమిటీ ప్రతినిధి విఠల్, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, ఏపీఎం గంగాధర్, సీసీలు, మహేందర్, నాగలక్ష్మీ, పండరి, భూమయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: మండల, గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో, మహిళా పంచాయతీ కార్యదర్శులకు, మహిళ ఉపాధిహామీ సిబ్బందికి, శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రభాకర్‌చారి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, మండల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఎల్లారెడ్డి తాలూకా టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో అధ్యక్షుడు లచ్చిగారి మహిపాల్ మాట్లాడుతూ స్త్రీలను గౌరవించిన చోటే లక్ష్మీ తాండవిస్తుందన్నారు. వ్యవసాయశాఖ ఏడీ రత్న, సీడీపీవో స్వరూప, వివిధ శాఖలకు చెందిన మహిళ ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాజాగౌడ్ శ్రీకాంత్, కార్యదర్శి చరణ్, కోశాధికారి రవీందర్, ఫస్ట్ ఉమెన్ ప్రెసిడెంట్ వసంత లక్ష్మీ, జాయింట్ సెక్రెటరీ అభినవ్ కుమార్, స్వాతి, కృష్ణ శంకరయ్య, ప్రశాంత్ కుమార్, శారద, శరత్ చంద్రప్రసాద్, రవీందర్, ముఖిద్ తదితరులు పాల్గొన్నారు

దోమకొండ: మండలంలోని సీతారాంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో జ్యోతి, సుమలతను ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సంద్బంగా ఉపాధ్యాయలు మహిళా సధికారత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు శర్మ, ప్రేమ్ కుమార్, రామరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మండలంలోని గిద్ద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, మెమోంటోలు అందజేసి ఘనంగా సన్మానిం నిర్వహించారు. పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులను శాలువలు, పూలదండలు, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. అంతేకాకుండా పాఠశాలలో పని చేయుచున్న మధ్యాహ్న భోజన మహిళా కార్మికులను కూడా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులకు వివిధ క్రీడలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు సింగాని పద్మ, పాఠశాల ఉపాధ్యాయులు ఎల్లయ్య, రామస్వామి, శశి కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి కోర్టులో మాట్లాడుతున్న న్యాయాధికారి వీఆర్ఆర్ వరప్రసాద్


మద్నూర్‌లో..


బీర్కూర్‌లో..


నాగిరెడ్డిపేటలో..


రామారెడ్డిలో..


మహ్మద్‌నగర్ పాఠశాలలో ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యుడు

మహమ్మద్‌నగర్ పాఠశాలలో ఫిజియోథెరపీ

నిజాంసాగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం ఫిజియోథెరపీ చికిత్స నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులకు వ్యాయామాల పట్ల ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవగాహన కల్పించారు. మండలంలోని ఆయా పాఠశాలల ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ అరుణ్ కుమార్, ఎంఈవో అమర్‌సింగ్, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ మధుసూదన్‌రావు, ఐఈఆర్‌టీ గైని చిన్న సాయిలు, పిల్లల తల్లిదండ్రులు ఉన్నారు.

నాగిరెడ్డిపేట స్పెషల్ ఆఫీసర్‌గా ఇంద్రసేన్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఏడీఏ ఇంద్రసేన్

నాగిరెడ్డిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండల స్పెషల్ ఆఫీసర్‌గా మాల్తుమ్మెద విత్తనక్షేత్రం ఏడీఏ ఇంద్రసేన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు నాగిరెడ్డిపేట స్పెషల్ ఆఫీసర్‌గా ఎల్లారెడ్డి ఏడీఏ రత్నం విధులు నిర్వహించారు. ప్రస్తుతం రత్నం స్థానంలో జిల్లా ఉన్నతాధికారులు మాల్తుమ్మెద విత్తన క్షేత్రం ఏడీఏ ఇంద్రసేన్‌కు మండల స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పగించడంతో ఆయన శుక్రవారం మండ ల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్‌చారి, కార్యాలయ సిబ్బంది అరుణ్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సమాఖ్య సభ్యులు

భిక్కనూరు సమాఖ్యకు జిల్లా ప్రథమ అవార్డు

భిక్కనూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు సమాఖ్యకు స్త్రీనిధిలో జిల్లా స్థాయిలో ప్రథమ అవార్డును వరించింది. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ప్రథమ అవార్డును కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చేతుల మీదుగా అందుకోవడం జరిగిందని ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి ద్వారా వంద శాతం రుణాలు అందించడం, రికవరీతో పాటుగా రుణాలు అందించి ఆర్థికంగా మహిళల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నందున ఈ జిల్లా ప్రథమ అవార్డు భిక్కనూరు సమాఖ్యకు వరించిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు రాజమణి, కార్యదర్శి విజయ, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.


నర్వ గ్రామంలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

● జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయకుంటే వాటిని రద్దు చేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు తెలిపారు. శుక్రవారం మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ, గుల్కుల్, తుంకిపల్లి, మగ్గంపూర్, సంగీతం గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఒక్కొక్క గ్రామానికి రూ.5లక్షల చొప్పున నిధులు కేటాయించామని ఆయన తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. గ్రామాల్లో సంక్షేమ అభివృద్ధి పథకాలను సకాలంలో పూర్తి చేయకుంటే వాటిని రద్దుచేసి వేరే గ్రామాల్లో పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. గ్రామాల్లో నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు చీకోటి మనోజ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు నాగభూషణం, లోక్యానాయక్, గంగి రమేష్, ఖాలిక్, గొట్ట నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


కాచాపూర్‌లో చికిత్స నిర్వహిస్తున్న వైద్యురాలు

ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేసుకోవాలి

భిక్కనూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ బీపీ, షుగర్స్ పరీక్షలు చేసుకోవాలని భిక్కనూరు వైద్యురాలు దివ్య తెలిపారు. శుక్రవారం భిక్కనూరు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వైద్య సిబ్బంది బీపీ, షుగర్స్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాంసాగర్ మండల అధ్యక్షురాలిగా అనిత

నిజాంసాగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం సమాఖ్య అధ్యక్షురాలిగా అనిత ఎన్నికయ్యారు. సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆధ్వర్యంలో నిర్వహించి నూతన పాలకవర్గం సభ్యులను నూతన పదాధికారులను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ప్రత్యేక అధికారి జగదీష్ హాజరయ్యారు. ఈ సమావేశంలో వీవో అధ్యక్షురాలు, ఏపీఎం, సీసీలు, అకౌంటెంట్ పాల్గొన్నారు. నూతన అధ్యక్షురాలిగా జి. అనిత, కార్శివ, జి సావిత్రి, కోశాధికారిగా కృష్ణవేణి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన పాలక కార్యవర్గాన్ని ప్రత్యేక అధికారి జగదీష్ ఏపీవో రామనారాయణ గౌడ్ ప్రమాణ స్వీకారం చేయించారు.

నెల్లూర్ స్వామి నేరాలు మానలేదు

● గతంలో డీఎస్పీనంటూ మోసాలు
● పోలీసులు పలు కేసులు నమోదు చేసినా మారని తీరు
● తాజాగా కామారెడ్డిలో చోరీ చేస్తూ పట్టుబడిన స్వామి

కామారెడ్డిటౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బీబీపేట మండలానికి చెందిన నెల్లూర్ స్వామి నేరాలు ఇంకా మానలేదు. గతంలో కరోనా సమయంలో నకిలీ డీఎస్పీగా చలామణి అవుతూ హల్‌చల్ సృష్టించాడు. దీంతో స్థానికంగా ఉన్న వారితో పాటు అనేక మంది ఇబ్బందులకు గురయ్యారు. అప్పట్లో ఆంధ్రజ్యోతిలో నకిలి డీఎస్పీగా వ్యవహరించిన నెల్లూర్ స్వామిలీలలను బట్టబయలు చేయడంతో జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చకు రాగా పోలీసులు అతనిపై కేసు సైతం నమోదుచేశారు. తాజాగా గురువారం అర్ధరాత్రి సదరు నెల్లూరుస్వామి చోరీకి పాల్పడ్డాడు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద గల హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం నుంచి ఏసీటీ ఫైబర్‌నెట్ ఉద్యోగి బాలకృష్ణ లక్షరూపాయలు డ్రా చేసుకుని బ్యాగులో పెట్టుకుని వెళ్తున్నాడు. అక్కడే ఉన్న నెల్లురు స్వామి ఆ డబ్బులతో ఉన్న బ్యాగును లాక్కొని పారిపోయేందుకు ప్రయత్నించాడు. వెంటనే బాలకృష్ణ అతడిని పట్టుకుని డయల్ 100కు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నెల్లురు స్వామి పోలీసుల ముందు సైతం తాను వెహార్ షాపు కు ఫ్రెండ్‌తో కలిసి వచ్చానని,అతను తనబ్యాగ్ తీసుకుని వెళ్లి పోయి ఫోన్ స్విచ్ఛాప్ చేసుకున్నాడని బ్యాంక్ వద్ద అతనిలాగే కనిపించడంతో తన బ్యాగ్ అని తీసుకున్నానని బుకాయించే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు అతనిని స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం ఉదయం సం ఘటనకు సంబంధించి పట్టణ పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు
ఇన్‌సెట్‌లో పట్టుబడిన నెల్లూరు స్వామి

తాళం వేసిన ఇంట్లో చోరీ

రాజంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మాణిక్య రాజమణి ఇంట్లో శుక్రవారం చోరీ జరిగిందని ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. మాణిక్య రాజమణి ఇంటికి తాళం వేసి కామారెడ్డిలో ఉంటున్న తన కూతురు వద్దకు వెళ్లింది. ఇంటికి తాళం ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చోరీకి పాల్పడి మూడున్నర తులాల బంగారం, పదివేల నగదు ఎత్తుకువెళ్లినట్లు తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

బీర్కూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారంలో శుక్రవారం తెల్లవారుజామున ఎంటికల అంజవ్వ అనే మహిళ ఇంట్లో విద్యుదాఘాతం సంభవించింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. కట్టుబట్టలు మినహా ఇంట్లో ఉన్న బంగారం, వెండి, నగదుతో పాటు వస్తువులు, వంట సామగ్రి అంతా అగ్ని ప్రమాదంలో కాలిపోయాయని సుమారు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. విద్యుత్ వైరుపై బట్టలు ఆరబెట్టారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా బట్టలకు మంటలు అంటుకుని ఇల్లంతా వ్యాపించాయి. అంజమ్మ ఆమె కుమారుడు పక్కింట్లో రాత్రి నిద్రపోయారు. తెల్లవారుజామున దట్టమైన పొగ రావడంతో అప్రమత్తమయ్యారు. నీళ్లతో మంటలను అర్పారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

చింతమాన్‌పల్లిలో ఒకరి అదృశ్యం

దోమకొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతమణిపల్లి గ్రామానికి చెందిన కొండ రమేష్(35) అనే వ్యక్తి పని నిమిత్తం కామారెడ్డి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి 3న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఎస్సై స్రవంతి తెలిపారు. అతని సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసు సిబ్బందికి ఇఫ్తార్ విందు

కామారెడ్డిటౌన్,మార్చి 07(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం పట్టణ సీఐ ఆధ్వర్యంలో పోలీసుశాఖలో పనిచేసే సిబ్బందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు, పట్టణ పోలీసు కార్యాలయంలో పనిచేసే ఎస్ఐలు శ్రీరాం, సిబ్బంది అజార్, శ్రీకాంత్, షరీఫ్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలి

మాచారెడ్డి,మార్చి 7(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ శాఖ డీఈ కళ్యాణచక్రవర్తి, ఏడీఈ నరేష్‌కుమార్ పొలంబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు బోర్లవద్ద విద్యుత్ పరికరాలు వినియోగం చేసేప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

నసురుల్లాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులు పట్ల ఉపాధ్యాయులు అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అన్నారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని పాఠశాల ప్రిన్సిపాల్ మాధవ్‌రావును ఆదేశించారు. ఆయన వెంట ప్రత్యేక అధికారి దయా నంద్, ఇంచార్జి ఎంపీడీవో సూర్యకాంత్ ఉపాధ్యాయులు రాధ ఉన్నారు.

పెద్ద కొడప్‌గల్ : మండలంలోని చిన్న బేగంపూర్, పోచారంతండా, చిన్నతక్కడ్‌పల్లి, జగన్నాథ్‌పల్లి గ్రామాలలో గల పాఠశాలలను మండల విద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల కోసం తయారుచే సిన మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతు విద్యార్థుల శక్తి సామర్థ్యాలు పెరిగేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని సూచించారు. సమయపాలన పాటించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డీఈవో రాజు


ఇందిరమ్మ ఇంటి పనుల పరిశీలన

దోమకొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి):మండల ప్రజా పరిషత్ కార్యాలయలం ఆవరణలో నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులను జిల్లా పరిషత్ సీఈవో చందర్ నాయక్ శుక్రవారం పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారిణి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, అనంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : తెలంగాణ రాష్ట్రంలో గల పేద ప్రజలకు గూడు సౌకర్యం కల్పించేందుకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు మం డల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్న తక్కడ్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులతో కలిపి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సంద ర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో నిలువనీడ లేని వారికి తమ ప్రభుత్వం 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లు మం జూరు చేస్తుందని తెలిపారు. దీంతో పాటుగానే ప్రజల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని పేర్కొ న్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అక్కలి సాయిరెడ్డి, చిప్ప మోహన్, శ్యామప్ప, కల్లూరి పండరి, చిల్లర్గి విఠల్ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణను నాలుగు గ్రూపులుగా చేయాలి'

ఎల్లారెడ్డి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను ఏబీసీడీ నాలుగు గ్రూపులుగా వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శివానందం అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జస్టిస్ షమీం అక్తర్ ఇచ్చిన నివేదికలో ఉన్న లోపాలను సరిదిద్ది ఎస్సీ వర్గీకరణ చేయాలని, మంత్రివర్గంలో మాదిగలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 10 వరకు జిల్లా మండల కేంద్రాలలో డప్పుల ప్రదర్శన నిర్వహిం చడం జరుగుతుందని, కార్యక్రమానికి పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కంతి పద్మారావు, తోట సాయిలు, ఆగమయ్య, గోపాల్ కిష్టయ్య సాయిలు తదితరులు పాల్గొన్నారు.



'నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం'

పెద్ద కొడప్‌గల్, మార్చి 07 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ మండలానికి ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద సీసీ రహదారుల నిర్మాణానికి గానునిధులు మంజూరు చేసిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్‌కు తాము రుణపడి ఉంటామని మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. శుక్రవారం నాయకులు మాట్లాడుతు అధికంగా నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పనిఒత్తిడితో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆత్మహత్యాయత్నం

బాన్సువాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పని ఒత్తిడి కారణంగా కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ 2018 నుంచి బాన్సువాడ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నాడు. 370 జీవో ప్రకారం 2022లో అప్పటి ప్రభుత్వం శ్రీకాంత్‌ను షాద్‌నగర్‌కు బదిలీ చేసింది. అయినప్పటికీ ఉన్నతాధికారులు శ్రీకాంత్‌కు డిప్యూటేషన్‌పై తిరిగి బాన్సువాడలోనే విధులు అప్పగించారు. దీంతో తనపై పని ఒత్తిడి విపరీతంగా ఉందని, వెంటనే తన డిప్యూటేషన్ రద్దు చేసి ట్రాన్స్‌ఫర్ చేయాలని శ్రీకాంత్ గత కొంతకాలంగా ఉన్నతాధికారులను కోరుతున్నాడు. అయితే వారు పట్టించుకోకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. దీంతో గురువారం రాత్రి బాన్సువాడ మండలం కృష్ణానగర్ తండా వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యకుయత్నించాడు. ఆ తర్వాత అక్కడి నుంచి నేరుగా బాన్సువాడలోని ఇంటికి వచ్చి తాను గడ్డి మందు తాగినట్టు కుటుంబసభ్యులకు చెప్పాడు. దీంతో కుటుంబీకులు అతన్ని వెంటనే బాన్సువాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శ్రీకాంత్ పరిస్థితి నిలకడగా ఉంది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఉన్నతాధికారులు శుక్రవారం బాన్సువాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి చేరుకొని శ్రీకాంత్‌ను పరామర్శించారు. త్వరలోనే బదిలీ చేసేలా చర్యలు తీసుకుంటామని వారు శ్రీకాంత్‌కు హామీ ఇచ్చారు.


చికిత్స పొందుతున్న ఏఈ శ్రీకాంత్

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - ఛావా
ప్రియా 70 - రిటర్న్ ఆఫ్ దా డ్రాగన్
ప్రియా 35 - శబ్దం

బాన్సువాడ

మహేశ్వరి - మజాకా
వెంకటేశ్వర - రాక్షస

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

